క్లుప్తంగా

నేడు ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

మైలవరం: మైలవరంలోని ఎస్ఎస్ బ్యాడ్మింటన్ ఎరీనా ఆధ్వర్యంలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ (మెన్స్ డబుల్స్) ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.12 వేలతో పాటు షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.8 వేలు, షీల్డ్, తృతీయ బహుమతి రూ.6 వేలు, షీల్డ్, నాలుగో బహుమతి రూ. 4 వేలు, షీల్డ్ అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మెషీన్ లెర్నింగ్, ఐఓటీలో నైపుణ్యం పెంపొందాలి

మైలవరం: మెషీన్ లెర్నింగ్, ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) రంగాల్లో విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో స్మార్ట్ సొల్యూషన్స్ అంశంపై ఏడు రోజులు జరిగిన వర్క్‌షాపు శనివారం ముగిసింది. వర్క్‌షాపులో రిసోర్స్ పర్సన్స్‌గా ఎస్ ల్యాబ్స్ టెక్నికల్ టీమ్ హాజరై విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చివరి రోజు విద్యార్థులు ఐఓటీలో స్మార్ట్ సొల్యూషన్స్‌తో ఇంటర్ లెవెల్ హ్యాకథాన్‌లో పాల్గొని తమ అనుభవాలను వ్యక్తంచేశారు. కో–ఆర్డినేటర్లు డాక్టర్ సల్మా ఆసియా బేగం, డాక్టర్ జమీర్, జాన్ వెస్లీ చప్పిడి, ఆర్. చిరంజీవి, పి. పద్మినిలకు విభాగాధిపతి డాక్టర్ ఎస్ జయప్రద అభినందనలు తెలిపారు.

ఉద్యోగినులకు క్రీడా పోటీలు



తిరువూరు: ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్య బహుమతి ప్రదానం చేశారు. ఆరోగ్య సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు: హనుమంతులగూడెంలో శనివారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారాను కలిగి ఉన్న ఓగిరాల తండాకు చెందిన అజ్మీర సాయికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. సాయి కుమార్‌కు సహకరిస్తున్న అతని అన్న అజ్మీర విజయ్‌పై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ కేఎండీ ఆరీఫ్, ఎక్సైజ్ ఎస్ఐలు వై. ఈశ్వరరావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

తిరువూరు: పునర్నిర్మించిన తిరువూరులోని పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు తెలిపారు. 10.30 గంటలకు యంత్రస్థాపన, ధ్వజస్తంభ, విగ్రహ స్థాపన, గోపుర దర్శనం, మహాకుంభ ప్రోక్షణ, శాంతి కల్యాణం జరుగుతాయని చెప్పారు.

విశేష హోమాలు.. అభిషేకాలు

శనివారం ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా విశేష హోమాలు, పంచామృత అభిషేకం, యాగశాలలో పూర్ణాహుతి, ఫల, పుష్ప, శయ్య, దాన్యాదివాసాలు, విష్ణు సహస్రనామ సంకీర్తన తదితర కార్యక్రమాలు జరిగాయి.

కట్టెలేరుపై వంతెన నిర్మించాలి

తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టెలేరుపై వంతెన నిర్మాణం చేపట్టాలని శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు శనివారం శాసన మండలిలో కోరారు. గత ఆరేళ్లుగా ఈ వంతెన లేక రైతులు, విద్యార్థులు, పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు మారినా వంతెన నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరమని లక్ష్మణరావు పేర్కొన్నారు.

చౌటపల్లి పీహెచ్‌సీలో తనిఖీలు



చౌటపల్లి(తిరువూరురూరల్): మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శరత్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వ్యాక్సినేషన్ రిజిస్టర్లు, వ్యాక్సిన్ నిల్వ ఉంచిన బాక్సులను ఆయన పరిశీలించారు. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నందున వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఉదయం వేళలో మాత్రమే నిర్వహించాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కనకదుర్గా భవాని, సూపర్‌వైజర్ మధుసూదనరెడ్డి, సీహెచ్ఓ దీవెనమ్మ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఘనంగా మహిళా దినోత్సవం
- తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో నిర్వహణ

తిరువూరు/మైలవరం/నూజివీడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో ఘనంగా జరిగింది. పలుచోట్ల కేక్‌లు కట్‌చేసి వివిధ రంగాల్లో మహిళల సేవలను వక్తలు కొనియాడారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీడీఓ సునీతశర్మ అధ్యక్షతన మహిళా దినోత్సవం జరిగింది. ఎంపీపీ పాలడుగు జోత్స్న మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అంగన్‌వాడీ ఆయాలు, ఏఎన్ఎంలను శాలువాతో సత్కరించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ పుష్పలత, వైస్ ఎంపీపీ బండి నాగమణి, సర్పంచి దేవమాత, ఏపీఓ ప్రమీల, ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. కేతనకొండ ఆర్కే కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర అద్వితీయమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్ పాల్గొన్నారు. జూపూడి నిమ్రా నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి మాట్లాడారు.

ఉత్తమ మహిళా వ్యవసాయాధికారిగా రాజ్యలక్ష్మి

విస్సన్నపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో విస్సన్నపేట మండల వ్యవసాయాధికారి జి. రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు. వ్యవసాయాధికారిగా ఆమె చేసిన సేవలను విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశా అభినందించారు. ఆమెకు కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందించారు.

మహిళలు అన్ని రంగాల్లో పోటీపడాలి

జి.కొండూరు: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేకు కట్ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణనాయక్, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, పలు శాఖలలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది, మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను సత్కరించారు. ఎంపీడీఓ అనూరాధ తదితరులు పాల్గొన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ మాట్లాడారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నార్త్ సౌత్ ఫౌండేషన్, విజయవాడ చాప్టర్ అధికారి లత, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మాట్లాడారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, కోఆర్డినేటర్స్, మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరం: మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ ఆధ్వర్యంలో మైలవరం నారాయణ నగర్‌లోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ట్రస్టు కోఆర్డినేటర్, ప్రవాసాంధ్రులు మేకా శ్రీలత, డాక్టర్ శిరీష, సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులను సత్కరించారు. మైలవరం 6వ వార్డులోని ఎంపీపీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి. గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

భూమితో పాటు సమస్త ప్రకృతిని స్త్రీమూర్తిగా మన భారతీయులు ఆరాధిస్తూ గౌరవిస్తారని రెడ్డిగూడెం ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య అన్నారు. రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. 50 శాతం జిల్లా పరిషత్ నిధులు నుంచి మంజూరైన కుట్టు మిషన్లను జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య లబ్ధిదారులకు అందజేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ముసునూరు: ముసునూరులో ప్రేరణాలయం డైరెక్టర్ సిస్టర్ సుధారాణి ఆధ్వర్యంలో ఆర్‌సీఎం విచారణ ఫాదర్ జోసఫ్ తంబి అధ్యక్షతన మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం వాణికుమారిలను సన్మానించారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు.

మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి..

చాట్రాయి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ లంకా నిర్మల మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణానికి మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలని ప్రదర్శన

తిరువూరు: మహిళలపై దాడులు అరికట్టాలని కోరుతూ ఎ.కొండూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎ.కొండూరులో మహిళా సంఘాల సభ్యులు పాల్గొని ప్రభుత్వ తీరును విమర్శించారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వంట ఏజెన్సీల కార్మికులకు కనీస వేతనాల అమలు ప్రకటనలకే పరిమితమైందన్నారు. ప్రతి రోజూ మహిళలు, విద్యార్థినులపై దాడులు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం, వెలుగు, అంగన్‌వాడీ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రైతులకు సత్కారం

లక్ష్మీపురం(తిరువూరురూరల్): కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో తిరువూరు మండలం లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పాడి రైతులు, పాల ఉత్పత్తిదారుల సంఘాల మహిళా అధ్యక్షులను సత్కరించారు. పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.



జి.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



కలెక్టర్ లక్ష్మీశా నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజ్యలక్ష్మి



ఇబ్రహీంపట్నంలో అంగన్‌వాడీ ఆయాను సత్కరిస్తున్న ఎంపీపీ జోత్స్న, ఎంపీడీఓ సునీతశర్మ



ముసునూరులో మహిళా సాధికారత ర్యాలీ

మహిళలే స్వర్ణాంధ్ర నిర్మాతలు..

నూజివీడు: మహిళలే స్వర్ణాంధ్ర నిర్మాతలని, మహిళలు అన్నిరంగాల్లోనూ సత్తా చాటుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం నూజివీడులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 4,589 మంది మహిళలకు రూ.11.47 కోట్లతో కుట్టుమిషన్లను ఉచితంగా అందించామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన మహిళలను మంత్రి సన్మానించారు. నూజివీడు పురపాలక సంఘం మాజీ చైర్ పర్సన్, వైద్యురాలు బొబ్బిలి ఝాన్సీరాణి, మాజీ కౌన్సిలర్ రిమ్మనపూడి నాగమణి, కొంపెల్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో ఎంపీపీ ప్రసన్నరాణిస్వామిని సత్కరిస్తున్న దృశ్యం



మైలవరంలో మహిళలను సత్కరించిన కోయ సుధ, మేకా లత తదితరులు

ఆడపిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి



నూజివీడు కోర్టులో మహిళా దినోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తులు నాగశైలజ, శివపార్వతి

న్యాయమూర్తి నాగశైలజ

నూజివీడు: ఆడపిల్లలను చులకనగా చూడకుండా వారిని చదివించి ప్రయోజకులను చేయాలని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగ శైలజ అన్నారు. పట్టణంలోని 15వ అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. మహిళల హక్కులకు భంగం కలుగుతుంటే మహిళలందరూ కలిసి సంఘటితంగా ఎదుర్కొనాలన్నారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివపార్వతి, పలువురు మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా సిబ్బంది, న్యాయవాదుల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి చేయాలి..

నూజివీడు: మహిళా శక్తి అపారమని, వారికి అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే సాధించలేనిది ఏదీ లేదని భారతీయం సత్యవాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, ఏఓ బి. లక్ష్మణరావు, సెంట్రల్ డీన్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో సర్పంచ్ లక్ష్మి, వైద్యాధికారి టీనాను సత్కరిస్తున్న దృశ్యం

అన్ని రంగాల్లో ముందుండాలి..

అగిరిపల్లి : మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు అన్నారు. పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ చొటపల్లి లక్ష్మి, వైద్య అధికారిణి టీనా, మహిళా వైద్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. వెలుగు కార్యాలయంలో రాజశేఖర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. భాగ్యలక్ష్మి ఇండియన్ గ్యాస్ నిర్వాహకులు పాలడుగు శ్రీనివాసరావు మాట్లాడారు. పోతవరప్పాడు ఎస్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో చైర్‌పర్సన్ కస్తూరిబాయి తదితరులకు సత్కారం

మహిళా సాధికారతకు వైఎస్ జగన్ కృషి

తిరువూరు: మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని పలువురు అన్నారు. ఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మహిళా దినోత్సవం జరిగింది. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్ పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మా వెంకటేశ్వరి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి తదితరులను కౌన్సిలర్లు, పార్టీ నాయకులు శాలువాలతో సత్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పొదుపు సంఘాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన గురించి నగర పంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి వివరించారు. తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ మాధురి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



తిరువూరు మినీ స్టేడియంలో మహిళా ఉద్యోగుల క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఆర్డీఓ మాధురి

ఎంపీపీకి సన్మానం..

తిరువూరు: తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీపీ గద్దల భారతిని ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. మహిళా ప్రజాప్రతినిధిగా రాణిస్తున్న ఆమెను పలువురు అభినందించారు. ఎంపీడీఓ రవిబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



తిరువూరు ఎంపీపీ భారతిని సత్కరిస్తున్న సిబ్బంది, ప్రజాప్రతినిధులు



ఎ.కొండూరులో మహిళల ప్రదర్శన

లోక్ అదాలత్‌లో 197 కేసులు పరిష్కారం

మైలవరం: మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 197 కేసులు పరిష్కారమయ్యాయని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి ఎం. శైలజ అన్నారు. తొలుత అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకుని, సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు. పోలీస్ సిబ్బంది, కోర్టు సూపరింటెండెంట్ బి. రంగనాయక్, బార్ అసోసియేషన్ కార్యదర్శి వీటీ కిశోర్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

నూజివీడు: రాజీ మార్గమే రాజ మార్గమని, క్షణికావేశంలో చేసిన తప్పులకు కేసులు పెట్టుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయంతోపాటు, డబ్బు నష్టపోతున్నారని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. పట్టణంలోని కోర్టు భవనాల ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో 228 కేసులను పరిష్కరించగా వీటిల్లో క్రిమినల్ 147, సివిల్ 31, ఎస్‌టీసీ 35 , బ్యాంకు సంబంధిత కేసులు 15 పరిష్కరించారు. రూ.1,25,44,960 ద్వారా బాధితులకు చెల్లించేలా నిర్ణయించారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి: మండలంలోని చొప్పరమెట్ల తాడేపల్లిలోని కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మొదటి స్థానం సాధించారు. టైమ్స్ ఆఫ్ ఇండియా, వెల్లేరు ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో కేకేఆర్ విద్యార్థులు ప్రదర్శించిన సాఫ్ట్ షీల్డ్, సేఫ్టీ షీల్డ్ ఫర్ బైక్ ప్రదర్శనలకు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ కోటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజునాథ్, సిబ్బంది అభినందించారు.



మొదటి స్థానం సాధించిన కేకేఆర్ పాఠశాల విద్యార్థులు

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శనలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఇంద్రకీలాద్రిపై శనివారం పలువురు కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. విజయవాడ శ్రీనటరాజ నృత్యాలయం కళాకారులు అమ్మవారికి నృత్య కళార్చన అర్పించారు. రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో 17 మంది కళాకారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్యం చేశారు. అమ్మ వారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శ్రీభరత మాత కోలాట భజన మండలికి చెందిన సభ్యులు కోలాట నృత్య ప్రదర్శన చేశారు.



12 నుంచి బ్రహ్మోత్సవాలు

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12న ప్రారంభమవుతాయని ఆలయ సహాయ కమిషనర్ ఏఎస్ సంధ్య తెలిపారు. 14వ తేదీ రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందని, కల్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఖమ్మం, ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి వచ్చే భక్తులకు రవాణా, వసతి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ముసునూరు బాలికల గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ అన్నారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 31 వరకు కొనసాగుతుందన్నారు. 5, 6, 7, 8 తరగతుల్లో ఖాళీలను బట్టి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఏప్రిల్ 25న గురుకుల పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

అడుగడుగునా గుంతలు



జి.కొండూరు: కట్టుబడిపాలెం నుంచి కవులూరు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. ఈ రహదారిలో ఓ జిప్సం బ్లాక్స్ తయారీ పరిశ్రమ ఉండడంతో నిత్యం భారీ వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడి రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల బుడమేరుకు వచ్చిన వరద ఉధృతి వల్ల రహదారి కోతకు గురై గుంతలు ఏర్పడిన నేపథ్యంలో మరమ్మతులు చేయకపోవడంతో ఈ రహదారి ప్రయాణికులకు, వాహన చోదకులకు నరకప్రాయంగా మారింది. ముఖ్యంగా ఈ రహదారిలో బుడమేరు డైవర్షన్ కెనాల్ వంతెనకు సమీపంలో రహదారిపై ఉన్న పెద్ద పెద్ద గుంతల్లోకి పక్కనే ఉన్న వ్యవసాయ భూముల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలి



నూజివీడులో టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్లు

నూజివీడు: పట్టణంలో టిడ్కో గృహాల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్లు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా సీపీఎం బృందం పట్టణ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలను శనివారం పరిశీలించారు. ఎస్ఆర్ హనుమాన్లు మాట్లాడుతూ వందలాది కోట్ల ప్రజాధనంతో నిర్మించిన టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయకుండా వదిలేయడం వల్ల శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ఆరేళ్ల క్రితం నిర్మించిన గృహాలను ఇంతవరకు లబ్ధిదారులకు అందజేయకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇప్పటికీ టిడ్కో గృహాల పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణమన్నారు. తాము ఇచ్చిన రుణాలను చెల్లించాలని బ్యాంకులు లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నాయని విమర్శించారు. ఇలా పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం విచారకరమన్నారు. సీపీఎం నాయకులు జి. రాజు, ఎస్. పద్మాంజలి తదితరులు పాల్గొన్నారు.